ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జోగులాంబ
గద్వాల

సోమవారం, 28 ఆగస్టు 2017, పేజీలు:16



- గద్వాల జిల్లాలో జోరుగా చర్చ
- నామినేషన్ల మొదలుకొని ప్రచారం వరకు ఆద్యంతం ఆసక్తికరం
- గెలుపుపై బంధు వర్గాలతో నిత్యం ఆరా తీస్తున్న ప్రజలు
- టీ కొట్ల వద్ద ఏ ఇద్దర్ని కదిలించినా ఇదే మాట
- ఎవరి అంచనాలు వారివే..
- ఫలితంపై కనిపించని స్పష్టత
- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

నంద్యాల ఉప ఎన్నిక.. ప్రస్తుతం ఎవరి నోట విన్నా ఇదే మాట. ఏ టీ కొట్టు వద్దకు వెళ్లినా ఏ ఇద్దర్ని కదిలించినా ఇదే చర్చ. ఉప పోరులో ఏ పార్టీ గెలుస్తుందనేదే హాట్ టాపిక్. రాష్ట్రాల్లోనే కాదు.. దేశ రాజధాని ఢిల్లీలో సైతం ఇదే చర్చ నడుస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు గద్వాల జిల్లాలోనూ ఇదే ఉత్కంఠ. నామినేషన్ల ఘట్టం మొదలుకొని.. ప్రచార పర్వం వరకు ఆద్యంతం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఫలితంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సోమవారం కౌంటింగ్ జరగనుండడంతో అందరూ ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనేదానిపై దృష్టి సారించారు. ప్రధానంగా కర్నూలు జిల్లాకు గద్వాల జిల్లా ఆనుకొని ఉండడంతో ఈ ప్రాంత ప్రజలకు నంద్యాల జిల్లా వాసులతో సంబంధాలు ఉన్నాయి. దీంతో నిత్యం బంధువర్గాలతో మాట్లాడుతూ ఫలితంపై ఆరా తీస్తున్నారు. ఎవరి లెక్కలు వారికి ఉన్నా.. ఎవరి అంచనాలు వారివైనా ప్రజల తీర్పు ఎలా ఉంటుందన్నది సోమవారం తేలిపోనుంది.



విజేత ఎవరు..?

సర్వత్రా ఉత్కంఠ

3లో

టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి

వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌ రెడ్డి

నేడు ఓట్ల లెక్కింపు

పశువుల పట్టివేత

నలుగురిపై కేసు నమోదు



నంది గోశాలకు తరలించిన ఆవులు

ఇటిక్యాల: గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 30 ఆవులు, ఎద్దులను పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. కర్నూలు నుంచి హైదరాబాదుకు డీసీఎం లారీలో పశువులను తరలిస్తుండగా వాహనాల తనిఖీలో గుర్తించినట్లు ఆయన తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు వీటిని తీసుకెళుతున్నట్లు చెప్పారు. వాటిని నంది గోశాలకు తరలించామని, నిర్వాహకులకు అప్పగించామన్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోమాత సేవ సంస్కృతిలో భాగం

- మాతా నిర్మలానంద భారతిదేవి
- 108 ఆవులకు ప్రత్యేక పూజలు
- ప్రకృతి సంరక్షణలో గోమాత సేవ వెల కట్టలేనిది

16



మాట్లాడుతున్న నిర్మలానంద భారతి

పాలమూరుపై సీఎం వివక్ష

- పాలమూరు-రంగారెడ్డిని రెండు దశల్లో చేపట్టాలి
- నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో అఖిలపక్షం ధర్నా

5

జిల్లాలో ప్రబలుతున్న అతిసార

- రోజుకు ఐదుకు పైనే కేసులు నమోదు
- తాగునీరు కలుషితం
- రోగాల బారిన ప్రజలు
- కాచి వడపోసిన నీటిని తాగాలని సూచిస్తున్న వైద్యులు

వివరాలు 7లో..

పొంగిన వాగులు

భారీ వర్షాలతో ఇటిక్యాల మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి.

- అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- వంకల్లో భారీగా చేరుతున్న వరద నీరు
- గ్రామాల్లో స్తంభించిన రాకపోకలు
- నిండు కుండలా చెరువులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

16



ఇటిక్యాల- ఆర్.గార్లపాడు గ్రామానికి వెళ్లే దారి పొంగిపొర్లుతున్న వంక

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కృష్ణా జలాల పునఃపంపిణీ చేపట్టాలి

● 'ఆంధ్రజ్యోతి'తో ప్రొఫెసర్ హరగోపాల్

(మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రముఖ సామాజికవేత్త, ప్రొఫెసర్ హరగోపాల్ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

పాలమూరుకు శతాబ్దకాలంగా అన్యాయం

ఉమ్మడి పాలమూరు జిల్లాకు శతాబ్దకాలంగా అన్యాయం జరిగింది. కృష్ణా నదీ జలాల్లో న్యాయమైన వాటా దక్కక పోవడంతో వనరులు లేక గ్రామాల్లోని పేదలు ఉపాధి కోసం వలసలు పోయారు. ఆకలిచావులు, వలస ప్రాంతాల్లో మరణాలు సంభవించాయి. వీటన్నింటినీ సరిదిద్దాలంటే కృష్ణా జలాల్లో పాలమూరుకు సహజమైన, న్యాయబద్ధమైన వాటా ఇవ్వాలి.

పాలమూరు నీటి సమస్యను దేశవ్యాప్తంగా ప్రచారం చేశాం

తెలంగాణ ఉద్యమ సమయంలో పాలమూరు నీటి సమస్యను కూడా దేశవ్యాప్తంగా ప్రచారం చేశాం. రాష్ట్రం వచ్చాక పాలమూరుకు న్యాయం జరుగుతుందని, నదీ జలాల కేటాయింపుల్లో జిల్లాకు ఎక్కువ నీటిని కేటాయిస్తారనిప్రజలంతా ఆశించారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆలోచనతో ప్రజల్లో రేకెత్తిన ఆశలు

నీళ్లు పొందడం అసాధ్యమని అనుకుంటున్న సందర్భంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి ఆలోచన జరగడంతో ప్రజల్లోనూ ఆశలు రేకెత్తాయి. తమకూ నీళ్లొస్తాయనే నమ్మకం పెరిగింది. స్వరాష్ట్రం వచ్చాక తప్పని సరిగా నీటి పంపిణీ జరుగుతుందని విశ్వసించారు.

న్యాయంగా, ప్రమాణాల మేరకు నీటి పంపిణీ జరగడం లేదు

స్వరాష్ట్రం ఏర్పాటయ్యాక మూడేళ్ల అనుభవాలను పరిశీలిస్తే రాష్ట్రంలో నీటి పంపిణీ న్యాయబద్ధంగా, ప్రమాణాల మేరకు జరగడం లేదని అనిపిస్తోంది. వెనుకబాటుతనం, పేదరికం, వర్షపాతం, కరువు దృష్ట్యా నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. వర్షాభావ ప్రాంతాలకు నదులు అందుబాటులో ఉన్నప్పుడు నది నీటిని అందించడమే తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు. ఈ ప్రమాణలన్నింటినీ కనీసం పట్టించుకోకుండా ఇవాళ తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా నీళ్లను కేటాయిస్తోంది.

అడగాల్సిన అవసరం లేకుండానే నీళ్లిస్తే ఈ సమస్య వచ్చేది కాదు

తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రం వచ్చాక తప్పనిసరిగా న్యాయబద్ధంగా పాలమూరు జిల్లాకు నీటిని ఇస్తారనే విశ్వాసం ఉండేది. రాష్ట్రం వచ్చి మూడేళ్లయినా ఆసమస్యపై ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కల్పించలేకపోవడం వల్లే ఇది మళ్లీ ఒక సమస్యగా ముందుకొచ్చింది. కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలనే డిమాండ్ న్యాయమైనది కాబట్టే దాన్ని సాధించుకు నేందుకు పాలమూరు ప్రజలు విశ్వాసంతో ముందుకెళుతున్నారు.

పాలమూరుకు ఇప్పుడు న్యాయం జరగకపోతే భవిష్యత్X అంధకారమే

స్వరాష్ట్రం సిద్ధించిన ఈ సందర్భంలో పాలమూరు ప్రజలకు నదీజలాల్లో న్యాయం జరగాల్సి ఉంది. న్యాయమైన వాటా దక్కకపోతే భవిష్యత్X అంధకారమవుతుంది.

డిండికి నీటితరలింపుపై చర్చను కొట్టేయడం సరికాదు

మహబూబ్‌నగర్ నుంచి డిండికి నీటిని తరలించే అంశంపై పాలమూరు ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. స్వయంగా అధికారపార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలే దీనిపై పునరాలోచించాలని సీఎంకు లేఖ రాశారు. ఈ అంశంపై మేం ప్రజలను రెచ్చగొడుతున్నామని ప్రచారం చేయడం సమంజసం కాదు. డిండికి నీటిని తరలించే అంశంపై జరుగుతున్న చర్చ మరింత ఆరోగ్యకరంగా జరగాలి. వాస్తవాలను దగ్గరపెట్టుకొని, సాధ్యాసాధ్యాలపై చర్చ జరగాల్సి ఉండగా.. దానినిప్రభుత్వం కొట్టేయడం సరికాదు.

శ్రీశైలం కంటే ముందే పాలమూరుకు నీటిని తీసుకోవాలనే మా అభిప్రాయాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు

పాలమూరు ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం నుంచి నీటిని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జూరాల నిండాక, జిల్లా నుంచి కిందకు వెళ్లే నీరే అంతదూరం వెళ్లాక తీసుకునే బదులు, ముందే తీసుకోవాలని మేం చెబుతున్నాం. దీన్ని ప్రభుత్వం తప్పుగా అర్థం చేసుకుంది.

ధర్నాలను విజయవంతం చేయాలి

కృష్ణా జలాల్లో పాలమూరుకు న్యాయమైన వాటా దక్కించుకునేందుకు సోమవారం నిర్వహించతలపెట్టిన అఖిలపక్ష ధర్నాలను విజయవంతం చేయాలి. నీటిలో హక్కు సాధించుకునేంత వరకు ఈ ఉద్యమం కొనసాగిద్దాం.

కుటుంబానికి.. ఆమే ఆసరా

తరుణి

- సరికొత్త డిజైన్లతో కుట్లు, అల్లికలు చేస్తున్న లలితాబాయి
- స్వయం ఉపాధితో కుటుంబపోషణ
- తోటి మహిళలకూ శిక్షణ
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వైనం



దుస్తులు కటింగ్ విధానంపై వివరిస్తున్న లలితాబాయి



దుస్తులు కుట్టే విధానంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

పుట్టింట్లో ఖాళీగా ఉన్న సమయంలో నేర్చుకున్న విద్య నేడు జీవనోపాధిని కల్పించింది. కుట్టుమిషన్‌లో శిక్షణ పొంది నేడు వాటితోనే కుటుంబాన్ని పోషిస్తున్నారు లలితాబాయి. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా దృఢ సంకల్పంతో, పట్టుదలతో ప్రయత్నిస్తే.. స్వయం ఉపాధి పొంది తమ కాళ్లమీద తాము నిలబడవచ్చు అనే దానికి ఆమె నిదర్శనంగా నిలుస్తున్నారు.

- అయిజ టౌన్

అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన హీరోజిరావు, అనంతబాయిలకు 1970లో జన్మించారు లలితాబాయి. కర్నూలుకు చెందిన కృష్ణాజిరావుతో 1987లో ఆమెకు వివాహం జరిగింది. మెట్టినింట్లో ఆర్థిక స్థితిగతులు బాగులేక అయిజలో స్థిరపడ్డారు. అక్కడ కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో లలితాబాయి తానే కుటుంబానికి ఆసరాగా నిలబడాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా వివాహం కాకమునుపు పుట్టినింట్లో ఖాళీ సమయాల్లో నేర్చుకున్న కుట్టు పని మీద దృష్టి పెట్టారు. ఇంకొన్నాళ్లు శిక్షణ పొంది మెరుగ్గా కుట్లు, అల్లికలు వేయడంలో దిట్టగా నిలిచారు. ఇక వాటినే ఆసరా చేసుకుని జీవనం సాగించడం మొదలు పెట్టారు.

కళా నైపుణ్యంతో సరికొత్త డిజైన్లు..

ఆమె కళానైపుణ్యంతో కొత్తకొత్త డిజైన్లు వేయడంతోబాటు డిజైన్X జాకెట్లు , డ్రెస్‌లు, చుడీదార్లు, స్టోన్స్ గాగ్రాలతో పాటు ఆఫ్‌శారీలపై డిజైన్ల మ్యాచింగ్ అయ్యే విధంగా ఆధునిక పద్ధతులతో కుట్టడం చేస్తున్నారు. ఆమెలో ఉన్న కళానైపుణ్యాన్ని చూసి పలువురు మహిళలుఆమె వద్ద శిక్షణ తీసుకునేందుకు సైతం ఎంతో ఆసక్తితో ముందుకు వచ్చారు. శిక్షణ పొందేవారికి అతితక్కువ కాలంలో పూర్తి శిక్షణను ఇచ్చి వారికాళ్లపై వాళ్లు నిలబడే విధంగా ప్రోత్సహిస్తున్నారు లలితాబాయి. అలా 30 ఏళ్లలో వందలాది మందికి శిక్షణ ఇచ్చి దిట్టలుగా మార్చారు. ఈ పని ప్రారంభించిన తొలినాళ్లలో ఆమె కొన్ని దుస్తులు స్వయంగా కుట్టి.. అనంతరం భర్తతో కలిసి ఊరూరూ తిరుగుతూ వాటిని అమ్మకాలు జరిపేవారు. ప్రస్తుతం వయసు మీద పడుతున్నా లెక్కచేయక పనే ధ్యేయంగా ముందుకు పోతూ కుటుంబానికి ఆసరగా నిలుస్తూ.. పలువురికి ఉ పాధి కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు లలితాబాయి.

ప్రభుత్వం మహిళలకు ఆధునిక కుట్టుమిషన్లు సబ్సిడీపై అందించి వారి వ్యాపారాలకు బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి రుణాలకు ఇచ్చి ప్రోత్సహిస్తే ఎంతో మహిళలు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉందని లలితాబాయి పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి..



తమ ఆర్థిక పరిస్థితులు బాగు లేకున్నప్పుడు కుట్లు, అల్లికలు ఆసరాగా నిలిచాయి. ఈ పనులు రాకుంటే నా కుటుంబం రోడ్డున పడేది. కుట్లు, అల్లికలతో కుటుంబాన్ని పోషిస్తున్న నేను నేర్చుకున్న విద్యను తోటి వారికి సైతం నేర్పుతూ సంతృప్తి పొందుతున్నాను. నా సంపాదనతోనే నా కూతురు, కొడుకును చదివిస్తున్నాను. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే ఇంకా ఎంతో మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది.

- లలితా బాయి

లతిలాబాయి వద్ద శిక్షణ తీసుకున్నా..



లలితాబాయి వద్ద నేర్చుకున్నకుట్లు, అల్లికలు నేడు నా కుటుంబానికి కూడా జీవనాధారమయ్యాయి. నా కుటుంబ భారాన్ని మోస్తున్న నా భర్తకు నేను కుట్టుతో ఆర్థికంగా తోడ్పాటునందిస్తున్నాను. నేను మాఇంటి దగ్గరనే కుట్టు ప్రారంభించాను. కొత్త కొత్త డిజైన్లు కుడుతున్నాను.

- కుతీసాబేగం, గృహిణి

సీతారాములుకు నిత్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

వడ్డేపల్లి: మండలకేంద్రమైన శాంతినగర్‌లో ఉన్న శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయం నిత్యపూజలతో విరాజిల్లుతోంది. సీతారాముల వారు కొలిచిన భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ఈ ఆలయంలో గణపతి, శివుడు, నవగ్రహాలతో పాటు మేడిచెట్టు, రావి, జమ్మి, ఊసరి చెట్లు ఉన్నాయి. ఆలయంలో జరిగిన పెళ్లిల్లు పదికాలాల పాటు చల్లగా ఉంటాయని భక్తుల నమ్మకం. ఈ ఆలయం 2003లో నిర్మాణం జరిగింది. గ్రామపెద్దలు చందాలు వసూలు చేసి సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయంలో హోమాలు, అభిషేకాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఆలయ ప్రాంగణంలో వివిధ దేవతా మూర్తులు కొలువై ఉన్నందు న భక్తులు రోజూ పెద్ద సంఖ్యలో వస్తుంటారు. పండగలు, పర్వదినాలు, కార్తీక, శ్రావణమాసాలు, ముక్కోటిఏకాదశి ఆలయం కిటకిటలాడుతుంది. శ్రీరామనవమిరోజు రాములోరి కల్యాణసందర్భంగా భక్తులు పోటెత్తుతారు. వారికి ఆలయ నిర్వాహకులు అన్నదానం సైతం చేపడతారు. అయితే ఆలయా ల్లో పనిచేసే పూజారులకు ప్రభుత్వం జీతాలు ఇస్తే బాగుటుందని ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచారి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎయిడెడ్ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

● రామన్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు

లీడర్ వాయిస్



వడ్డేపల్లి: రాష్ట్రంలో ఉన్న ఎయిడెడ్ ప్రభుత్వపాఠశాలలను ప్రభుత్వం స మానంగా ఆదరించి వసతులు కల్పిస్తే విద్యావ్యవస్థ మెరుగుపడుతుందని శాంతినగర్‌లోని రవీంద్ర ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్X గౌడ్ అన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో కనీస వసతులు సైతం కరువయ్యాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకుమెడికల్ ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తే బాగుంటుందన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విదానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చాలాపాఠశాలల్లో పీఈటీలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జిల్లాకేంద్రాల్లో ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్‌ఏను 20శాతానికి పెంచాలని, అలాగే బోధనకు ఆటంకం లేకుండా ఉపాధ్యాయపోస్టుల ను వెంటనే భర్తీచేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

జోగుళాంబకు బంగారు నాలుక బహూకరణ

అలంపూర్: ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబదేవి అమ్మవారికి కర్నూలుకు చెందిన నాగచంద్రావతిదేవి అనే భక్తురాలు 15గ్రాముల బంగారు నాలుకను బహూకరించారు. ఆదివారం ఆమె ఆలయానికి చేరుకుని తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ గురురాజాకు బంగారు నాలుకను అందజేశారు.


అమ్మవారికి ఇచ్చిన బంగారు నాలుక

వర్షానికి కూలిన ఇళ్లు

మానవపాడు : మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం విస్తరంగా కురిసింది. ఆయా గ్రామాలలో చిన్న చిన్న కుంటలు నిండిపోయాయి. వాగులు పారాయి. బోరవెల్లి గ్రామంలో అదివవారం తెల్లవారు జామున వర్షానికి రెండు ఇళ్లు కూలిపోయాయి. లోతట్టున ఉన్న ఇళ్లలోకి నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమరవాయి, గోకులపాడు గ్రామాల వాగులు బ్రిడ్జిపై నాలుగు అడుగుల మేర నీరు పారింది. గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి.


బోరవెల్లిలో కూలిన సంజమ్మ ఇల్లు

నంద్యాల విజేత ఎవరు ..?

- గద్వాల జిల్లాలో జోరుగా చర్చ
- గెలుపుపై బంధు వర్గాలతో ఆరా
- నేటి ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఉత్కంఠ



గద్వాల: దేశంలో ఇటీవల డోక్లామ్ సమస్యపై దేశ ప్రజలు ఎంతగా దృష్టి సారించారో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఓ ఉప ఎన్నికపై కూడా అదే తరహాలో చర్చ నడుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఉప ఎన్నికపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. మరోవైపు ఎక్కడ చూసినా బెట్టింగ్‌లు పెరిగిపోయాయి. ఏపీలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ ఈ ఎన్నికను వచ్చే సాధారణ ఎన్నికలకు రెఫరెండంగా భావించడంతోనే ఇంత పెద్దఎత్తున చర్చ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ రాజకీయ వాతావరణం బాగా వేడెక్కడంతో జాతీయ మీడియాలో సైతం కథనాలు ప్రచురితమయ్యాయి. రెండు పార్టీలు పోటాపోటీగా ప్రచారానికి దిగడంతో దేశ రాజధాని ఢిల్లీలోనే చర్చనీయాంశమైంది.

మొదటి నుంచి సంబంధాలు మెండు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించినప్పటికీ కొన్ని ప్రాంతాలతో విడదీయని అనుబంధం ఉంది. ప్రస్తుతం కర్నూలు జిల్లా ఈ కోవకే చెందుతుంది. కొత్తగా ఏర్పడిన గద్వాల జిల్లాకు కర్నూలు ఆనుకొని ఉండడంతో ఇక్కడి ప్రజలకు అక్కడి వారితో సంబంధాలు మెండుగా ఉన్నాయి. కర్నూలుతో పాటు నంద్యాల ప్రాంత వాసులతో కూడా చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వివిధ రకాల వ్యాపారాలతోపాటు వివాహ సంబంధాలు కూడా ఉన్నాయి. వైసీపీ నుంచి గెలుపొందిన ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గద్వాల మండలానికి అల్లుడు కావడం గమనార్హం. అంతకు మునుపు అంటే మాజీ రాష్ట్ర పతి నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి హయాం నుంచి ఇరు ప్రాంతాలతో రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఈ అనుబంధం నేపథ్యంలోనే నంద్యాలలో జరుగుతున్న ఉప ఎన్నికపై జిల్లా ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ఎన్నికల సందర్భంగా అక్కడ జరుగుతున్న ప్రతి అంశంపై ఈ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏ టీ కొట్టు వద్దకు వెళ్లినా.. ఏ ఇద్దర్ని కదిలించినా ఇదే అంశంపై మాట్లాడుకోవడం కనిపిస్తోంది. నంద్యాల నుంచి ఈ ప్రాంతానికి కోడళ్లుగా వచ్చిన వారు, ఇక్కడి నుంచి అక్కడికి కోడళ్లుగా వెళ్లిన వారి ఇళ్లలో ఒకటే చర్చ. కొందరు నంద్యాలలో గెలుపు ఎవరిదనేదానిపై మాట కలిపితే మరొకొందరు ఓ అడుగు ముందుకు వేసి ఫలితాలు కూడా ప్రకటించేస్తున్నారు.

ఆద్యంతం.. ఆసక్తికరం

నంద్యాల ఉప ఎన్నిక గురించి జిల్లాలో పలు ఆసక్తికరమైన సంఘటనలు కనిపిస్తున్నాయి. అక్కడికి వెళ్లి వచ్చిన కొందరు పక్కాగా లెక్క వేసి మరీ చెబుతున్నారు. మహిళా ఓటర్లే గెలుపును అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. నంద్యాలలో మొత్తం 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి బ్రహ్మానందరెడ్డి, వైసీపీ నుంచి శిల్పా మోహన్ రెడ్డి, కాంగ్రెసు నుంచి అబ్దుల్ ఖదీర్ పోటీ పడ్డారు. ముగ్గురు అభ్యర్థులు కూడా నంద్యాల పట్టణంలోనే ఎక్కువగా ప్రచారం నిర్వహించినట్టు సమా చారం. నంద్యాలలో మొత్తం ఓటర్లు 2,18,858 మంది కాగా, ఒక్క నంద్యాల పట్టణంలోనే 1,42,628 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం మహిళ ఓటర్లు 1,11,018 కాగా, ఇందులో 88,503 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నంద్యాల పట్టణంలో 1,05,629 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో మహిళలే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని రాజకీయ పక్షాలు అంచనా వేస్తున్నాయి. అలాగే నంద్యా ల రూరల్ పరిధిలో 47,386 మంది ఓటర్లకు గాను 41,514 మంది, గోస్పాడు మండలంలో 28,844 ఓటర్లకు గాను 26,192 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు తెలు స్తోంది. అయితే గెలుపు ఓటములపై ప్రధాన రాజకీయ పక్షాలు ఓ అంచనాకు రాలేకపో తున్నాయని తెలుస్తోంది. మరో వైపు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అబ్దుల్ ఖాదీర్ నంద్యాల పట్టణంలోనే ఎక్కువగా ప్రచారం నిర్వహించడంతో ఓట్ల చీలికపైనే రెండు ప్రధాన రాజకీయ పార్టీల భవిష్యత్తు ఆధారపడి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఊహకందని ఫలితం..

ఇప్పటికే పోలింగ్‌పై అనేక సర్వేలు జరిగినా ఫలితంపై స్పష్టత కనిపించడం లేదు. కొన్ని లెక్కలు వేసి మరీ చెబుతున్నా ఫలానా పార్టీ గెలుస్తుందని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. కొన్ని సర్వేలు టీడీపీ అని, మరికొన్ని వైసీపీ అని పేర్కొనడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల్లోనే అయోమయం నెలకొంది. బయటకు మాత్రం గెలుపు తమదంటే తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా రెండు పార్టీలు ఎన్నికలకు ముందు భారీ మెజార్టీతో గెలుపును దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేసినా ఎన్నికల నాటికి సీన్ రివర్స్ అయిందనే సంకేతాలు వెలువడుతున్నాయి. చివరకు ఎవరు గెలిచినా తక్కువ మెజార్టీతో బయటపడే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మండలవ్యాప్తంగా ముసురు వర్షం

ఉండవల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నుంచి ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉంటుండడంతో రోడ్లన్నీ బురదమయమవుతున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. తక్కశిలలో ప్రధానరహదారిపై నీరు పారుతుండడంతో నడవడానికి నానాయాతన పడుతున్నారు. రెండు రోజుల నుంచి వర్షం విడవకపోవడంతో చిన్నఆముదాల పాడు గ్రామంలోని మాల అయ్యన్న ఇల్లు శనివారం తెల్లవారుజామున కుప్పకూలింది. ఆ శబ్ధానికి కుటుంబ సభ్యులు తేరుకుని వెంటనే బయటికి పరుగులు తీశారు. దీంతో ఆరుగురు ప్రాణాప్రాయం నుండి సురక్షితంగా బయటపడ్డారు.


తక్కశిలలో ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

'రజకుల జోలికి వస్తే సహించం'

అలంపూర్: రజకుల జోలికి వస్తే సహించేది లేదని రజక సంఘం జోగుళాంబగద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి హెచ్చరించారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన రజకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రజకుల అభ్యున్నతికై తమ సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రజకులకు ప్రకటించిన వివిధ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రజకుల పట్ల నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని, రజక విద్యార్థులకు ప్రవేశపెట్టిన పథకాలను వెంటనే అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రజకులు మద్దిలేటి, చంద్రయ్య, రాధాకృష్ణ, రంగస్వామి, శ్రీను, వీరన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సంచారజాతులకు న్యాయం

- బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయులుగౌడ్



ఆంజనేయులుగౌడ్‌కు తోలు బొమ్మలను అందిస్తున్న వివిధ సంచారజాతుల వారు

గద్వాలటౌన్: పుట్టుకతోనే కళానైపుణ్యం సొంతం చేసుకున్న సంచార జాతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆంజనేయులుగౌడ్ హామీ ఇచ్చారు. సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనం వద్ద సంచారజాతుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో 11కోట్ల మంది జనాభా ఉన్న సంచారజాతులకు తగిన న్యాయం జరిగేలా బాలకృష్ణ సిద్ధంరేణు కమిషన్ చేసిన సిఫార్సులు ఏళ్లు గడుస్తున్నా అమలుకాకపోవడం సంచారజాతులకు శాపంగా మారిందన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్రంలో 3.20వేల మంది గుడిసెల్లో నివసిస్తున్నారని, 9లక్షల కుటుంబాలకు కనీసం భూమి లేదని తేలిన నేపథ్యంలో వారి అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి తక్షణ స్పందన చూపారన్నారు. కనీసం గుర్తింపు కూడా లేని కులాలకు న్యాయం జరిగేలా, ఆయా కులాలు గురించి అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్‌కు ఆయన ఆదేశాలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 20కులాలు ఏ జాబితాలో లేవని, వారంతా సంచార జాతుల వారేనని పేర్కొన్నారు. బ్రాహ్మణిజాన్ని, ఆధిపత్య ధోరణిలను ప్రశ్నించిన శైవమతం ప్రచారాన్ని నిర్వహించే సంచార జాతులు, చరిత్రను వర్తమానానికి అందించే నిజమైన కళాకారులన్నారు. సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ మాట్లాడుతూ సంచార జాతుల వారికి 200సంవత్సరాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, పొన్నాల కుమార్, ఇన్‌చార్జి చెన్నయ్య, డాక్టర్ కళాదాసరి రంగ, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధసంచార జాతుల వారు తమ స్థితిగతులను వివరిస్తూ ప్రభుత్వపరంగా సహాయం అందజేయాలని, కుల జాబితాల్లో చోటు కల్పించాలని బీసీ కమిషన్‌సభ్యుడు ఆంజనేయులుగౌడ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

'పేద రెడ్ల సంక్షేమానికి కృషి చేస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

వెల్దండ : సమాజ సేవలో పాలమూరు రెడ్డి సేవాసమితికి ప్రత్యేక స్థానం ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో పాలమూరు రెడ్డిసేవా సమితి నియోజకవర్గస్థాయి సమావేశం తాలూకా అధ్యక్షుడు తలసాని లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరగ్గా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది రెడ్డి కులస్థులు ఆర్థికంగా లేని పరిస్థితుల్లో బాధలను తమలోనే దిగమింగుకుని బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డి కులస్తులకు కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేసేందుకు ప్రభుత్వం ఈబీసీ సర్టిఫికెట్లు ఇవ్వకూడదని మెలిక పెట్టిందని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చించి సానుకూలంగా జీవో వచ్చేలా కృషిచేస్తామని పేర్కొన్నారు. వెయ్యి కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో నిర్మించే రెడ్డిసేవాసమితి కమ్యూనిటీ భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇతర దేశాల్లో స్థిరపడ్డ వారు పేదరెడ్డి కులస్తులను ఆదుకోవాలని కోరారు. రెడ్డి కులస్తులకు కల్యాణలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. ప్రతి రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ విజితారెడ్డి, ఎంపీపీ రామేశ్వరమ్మ, జిల్లా, తాలూకా నాయకులు సత్యనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పావనిరెడ్డి, వసంతరెడ్డి, బండెల రాంచంద్రారెడ్డి, డాక్టర్ హరికాంత్, శ్రీలత, మాధవరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి అశ్లేషారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు .

రెండు తలల దూడ జననం

కొత్తకోట: ఓ గేదెకు రెండు తలల దూడ పుట్టిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన రైతు సత్యారెడ్డి గేదెకు రెండు తలల దూడ పుట్టిందన్న విషయం గ్రామస్థులకు తెలియడంతో గుంపులుగా వచ్చి చూశారు. కొంతసేపటి తర్వాత దూడ మృతి చెందింది. జన్యులోపం కారణంగా రెండు తలల దూడ జన్మించిందని పశువుల డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.



రెండు తలల దూడ కళేబరం

చవితి వేడుకల్లో ప్రమాదం

- మండపం వద్ద విద్యుదాఘాతంతో ఆరుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన రాఘవ

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్ :వినాయక చవితి వేడుకల్లో ప్రమాదం చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తూడుకుర్తిలో గణేష్ మండపంలో విద్యుదాఘాతానికి గురై ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణేష్ మండపంవద్ద ఇనుప స్తంభానికి గ్రీస్ రుద్ది (జారుడు స్తంభం) ఆట నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో పొడవైన ఇనుప స్తంభాన్ని భూమిలో పాతుతుండగా పొరపాటున 11కేవీ వైర్లకు తగిలింది. దీంతో స్తంభాన్ని ఎత్తుతున్నవారంతా విద్యుదాఘాతానికి గురై పడిపోయారు. గ్రామస్థులు 108లో వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాఘవ పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని మహబూబ్‌నగర్‌కు తరలించారు. గాయపడిన సిద్ధు, శివకుమార్, రాజ్‌కుమార్, కురుమూర్తి, రవిలకు నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్

- అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్ టౌన్: ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమవుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 100, 800 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ నాలుగు విభాగాల్లో అండర్-14, 16, 18 స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడారులకు భోజన వసతి ఉంటుందని మంగళవారం ఉదయం 8గంటలకు మైదానానికి చేరుకొని నిర్వాహకులకు రిపోర్టు చేయాలని సూచించారు. గెలుపొందిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి దుర్గం కృష్ణప్రసాద్‌గౌడ్, డీఈఓ కార్యాలయ ఈఓ శ్రీధర్, లింగాల ఎంపీపీ మంజుల పాల్గొన్నారు.

మంగళవారం నాటి పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విధులు నిర్వహించాలని డీఈఓ జనార్దన్‌రావు ఆదేశానుసారం వారు సోమవారం ఉదయం 9గంటలకు పైకా భవనం నందు రిపోర్టు చేయాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి దుర్గం ప్రసాద్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బస్సు ఢీ: 9 గొర్రెల మృతి

మానవపాడు : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి స్టేజి సమీపంలో రోడ్డు పక్కన మేస్తున్న గొర్రెలపైకి బస్సు దూసుకెళ్లడంతో 9 గొర్రెలు మృతి చెందాయి. బాధితులు, స్థానికుల కథనం మేరకు మానవపాడుకు చెందిన శ్రీనివాసులు, రాముడులకు ప్రభుత్వ సబ్సిడీ కింద గొర్రెలు వచ్చాయి. మేపుకెళ్లి జాతీయ రహదారి వెంట వస్తుండగా కర్నూలు నుంచి గద్వాల వైపు వెళ్తున్న బస్సు అతి వేగంగా గొర్రెలపైకి దూసుకెళ్లింది. దీంతో 9 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



గొర్రెల కళేబరాలు

తెలంగాణ జాగృతి జిల్లా కో-కన్వీనర్‌గా విశాల్



గద్వాలఅర్బన్ : తెలంగాణ జాగృతి జిల్లా కో-కన్వీనర్‌గా పట్టణానికి చెందిన విశాల్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో, బాధ్యతలు అప్పగించిన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డికు ఆదివారం ఒక ప్రకటనలో విశాల్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలు పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటైన జాగృతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు.

అధ్వానం.. బోయలగూడెం రోడ్డు

- తారు లేచి కంకర తేలిన వైనం
- గుంతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

గట్టు : మండల పరిధిలోని బోయలగూడెం- ఇందువాసీ రోడ్డు అద్వాన స్థితికి చేరింది. రాయిచూర్ ప్రధాన రహదారి నుంచి ఇందువాసీ మీదుగా బోయలగూడెం వరకు వెళ్ళే ఈ రోడ్డు ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. రెండేళ్ల క్రితం వరకు బీటీగా ఉన్న ఈరోడ్డు గుంతలమయమై కంకర తేలి, రాళ్ల రహదారిగా మారింది. రోడ్డును బాగు చేయాలని, గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిదులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకుని నాతుడు కరవయ్యరు. రోడ్డు మరమ్మత్తు గురించి పట్టించుకోని అధికారుల తీరుపై గ్రామాల ప్రజలు అగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం పదుల సంఖ్యలో కార్లు, బస్సులతో పాటు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. కంకర తేలిన రోడ్డుపై వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతుండగా వాహనాలు పాడైపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా ఈ రోడ్డుకు మరమ్మత్తులు లేనందు వల్లే ఈ దుస్థితి తలెత్తిందని వారంటున్నారు. రోడ్ల అభివృద్ధి కోసం కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా గ్రామీణ రోడ్ల దుస్థితి మారలేదని, చెప్పేందుకు ఈరోడ్డే ఉదాహరణ అని వారంటున్నారు. వివిధ అవసరాల కోసం అయిజ, గద్వాల, రాయిచూర్, కర్నూల్‌కు వెళ్లాలంటే ఈ రోడ్డు ఒ క్కటే ఉన్నందు వల్ల సమస్యగా మారిందటున్నారు. అత్యవసర సమయంలో పట్టణాలకు వెళ్లాలంటే ప్రాణ భయంతో వణికిపోతున్నామని వాహనదారుల అంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి ఉన్నందున ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉండటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు రోడ్డు దుస్థితిని పట్టించుకొని మరమ్మతులు వెంటనే చేపట్టాలని పలువురు వాహనదారులు ఈ సందర్భంగా కోరుతున్నారు.



ఇందువాసి సమీపంలో తారుతేలి అద్వానంగా ఉన్న రోడ్డు దుస్థితి

ఇంటర్వ్యూ

హరితహారం లక్ష్యాన్ని చేరుకుంటాం

• ఏపీవో కుమార్



గట్టు: మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని జాతీయ ఉపాధి హమీ ఏపీవో కుమార్ వెల్లడించారు. గ్రామాల వారీగా నిర్దేశించిన హరితహారం కింద మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మండలంలో ఇప్పటివరకు హరితహారం కింద నాటిన మొక్కల వివరాలు ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వివరించారు.

మండలంలో హరితహారం కింద ఎన్ని మొక్కలు నాటారు ?

మండలంలో అన్ని గ్రామాల్లో హరితహారం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. మొత్తం 9లక్షల 60వేల మొక్కలు నాటడానికి లక్ష్యాలు నిర్దేశించాం.

జాబ్ కార్డులు ఎన్ని ఉన్నాయి ?

ఉపాధి హమీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు 17,991 జాబ్‌కార్డులు ఉన్నాయి. 100రోజులు పనిదినాలు పూర్తిచేసిన వారు 100మంది వరకు ఉన్నారు.

ఐఎస్ఎల్ మరుగుదొడ్ల నిర్మాణం ఎంత వరకు వచ్చాయి ?

మండలంలో ఐఎస్ఎల్ కింద మొత్తం 3810 మంజూరు కాగా 122పూర్తిచేశారు. ఇందులో 503మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 122నిర్మాణాలకు బిల్లులు చెల్లించాం.

ఫీల్డ్‌అసిస్టెంట్లు పూర్తిస్థాయిలో ఉన్నారా ?

మండలంలో 24జీపీలకు సంబంధించి 18మంది ఎఫ్ఏలు ఉన్నారు. మిగతా ఎనిమిది మంది సీనియర్ మేటీలతో గ్రామాలలో పని నిర్వహిస్తున్నాం.

పాలమూరుపై సీఎం వివక్ష

- పాలమూరు-రంగారెడ్డిని రెండు దశల్లో చేపట్టాలి
- నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో అఖిలపక్షం ధర్నా
- హాజరు కానున్న అన్ని రాజకీయ పార్టీ, ప్రజా సంఘాలు, జేఏసీ
- ఎమ్మెల్యే డీకే అరుణ

గద్వాల: ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం ఉత్తర తెలంగాణకే ప్రాధాన్యం ఇస్తూ దక్షిణ తెలంగాణ ప్రాంతంపై వివక్ష చూపిస్తున్నారనే భావన ప్రజల్లో ఉందని పీసీసీ ఉపాధ్యక్షురాలు, ఎమ్మెల్యే డీకే అ రుణ అన్నారు. ఆదివారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లతో నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును గతంలో డిజైన్ చేసిన ప్రకారం రెండు దశల్లో నిర్మాణ పనులను చేపడితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. జూరాల-1, శ్రీశైలం-2 అనే రెండు దశల కింద ఈ ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టుకు పాలమపూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి రోజూ అర టీఎంసీ నీటిని ఇచ్చే విధంగా డిజైన్ రూపొందించారని, అలా కాకుండా ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీటిని డిండి ప్రాజెక్టుకు ఇవ్వాలని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అనుసంధానం చేయాలని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను, అన్‌గోయింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు, జేఏసీలు ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల ఫేజ్-1 కింద నిర్మాణం చేపడితే నారాయణపేటు, కొడంగల్, షాద్‌నగర్ తదితర ప్రాంతాలు, ఫేజ్-2 కింద పాలమూర్ - రంగారెడ్డి నిర్మాణం స్థలం మార్చి శ్రీ శైలం నుంచి చేపట్టాన్నారు. దీనివల్ల పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద భూముల ముంపును నివారించవచ్చన్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గరవుతున్న భూములకు 2013 చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలని, భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేసి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, గడ్డం కృష్ణారెడ్డి, నాయకలు బండల వెంకట్రాములు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, డిటిడీసి నర్సింహులు, బంగి సుదర్శన్X ఉన్నారు.

'మదర్' బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

• మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి

గద్వాల టౌన్ : మదర్ థెరిస్సా బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి పేర్కొన్నారు. సేవకు ప్రతి రూపంగా విశ్వమాతగా ఖ్యాతి గాంచిన మదర్ థెరిస్సా 108వ జయంతిని ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ అంధుల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక వేదవ్యాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కేక్ కట్ చేసి, మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక నాయకుడు బాలగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మదర్ నిస్వార్థ సేవతో ప్రపంచం దృష్టిని ఆకర్షించారన్నారు. మదర్ థెరిస్సా జయంతిని ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తే మరింత గౌరవంగా ఉండేదన్నారు. తెలుగు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి సంజీవులు, తాలూకా అధ్యక్షుడు టీజీ రాజు, తెదేపా నాయకుడు ఇస్మాయిల్, వీరబాబు, ప్రబాకర్, కళాకారుడు చరణ్, దరూర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. వీరబాబు అంధ విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే బ్రెయిలీ పలకలు అందించారు. కళాకారుడు చరణ్‌కు ప్రతినెల రూ. 5వేలు చొప్పున సంవత్సరం పాటు అందజేస్తానన్నారు. విద్యార్థులకు రాజలింగం, బీచుపల్లి 100టవళ్ళు, బీరెల్లి రాముడు క్వింటాల్ సన్నబియ్యం అందజేశారు. విద్యార్థులకు వాకిటి సంజీవులు అన్నదానం నిర్వహించగా ఢిల్లీవాలా స్వీట్ హౌస్ వ్యాపారి పరమేష్ మిఠాయిలు పంచారు.

వినాయక ఉత్సవాల్లో ముగ్గుల పోటీలు

- శృతిలయ చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు

గద్వాలటౌన్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని కొత్తహౌసింగ్ బోర్డు కాలనీలో, ఉత్సవ కమిటీ నిర్వహకులు మహిళలకు ముగ్గులపోటీలను నిర్వహించారు. హైందవ సంప్రదాయంలో, రంగవల్లులకు ఉన్న ప్రాముఖ్యత, విశిష్టతలను వివరించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు గణేష్ ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ, ద్వీతీయ, తృతీయ బహుమతులు వరుసగా లక్ష్మీ, రాధ, రాధలకు అందజేశారు. కాలనీవాసులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక శృతిలయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహకుడు శెట్టి అమరేష్ శిష్యబృందం చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతితనయుడుగా గౌరీగణేశుడు జన్మవృత్తాంతం తెలిపే విధంగా చిన్నారులునిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రిముగ్దులను చేశాయి. ధరూరు మెట్టు వీధిలో ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవమండపం వద్ద నిర్వహకుడు పేపర్ నర్సింహులు అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో గద్వాల మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ గడ్డంకృష్ణారెడ్డి, నాయకులు వెంకట్రాములు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

మాంసం ధరలు

మటనX కిలో	: రూ.440
చికెనX స్కినX లెస్	: రూ.180
స్కినX తో	: రూ.160
నాటుకోడి కిలో	: రూ.350

చేపల ధరలు

దూబొచ్చ కిలో	రూ.130
పొందుగ	రూ.350
బొచ్చ	రూ.300
కొర్రమట్టలు	రూ.400

జిల్లాలో ప్రబలుతున్న అతిసారా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోషమ్మ

- రోజుకు 15కు పైనే కేసులు నమోదు
- ఒక్క గద్వాలలోనే ప్రతిరోజు పది కేసులు
- కలుషితమవుతున్న తాగునీరు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నీటిని కాచి వడపోసి తాగాలి : విజయ్‌కుమార్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, గద్వాల

